అందాల భామ

వసుంధర

అది చిన్న పెంకుటిల్లు. అందులో ఉంటున్నది సుభద్రమ్మ. సుభద్రమ్మకు భర్త లేడు. కష్టపడి పెంచి చదివించి కొడుకు రామాన్ని గ్రాడ్యుయేట్ చేసింది. ఆమె ఆశలన్నీ రామంమీదనే వున్నాయిప్పుడు.

రామానికింకా ఉద్యోగంలేదు. ఉద్యోగ ప్రయత్నాలు చేస్తూనే అతడు అక్కడా ఇక్కడా అంతో యింతో సంపాదిస్తున్నాడు. ఆ సంపాదన మామూలు ఉద్యోగుల నెల జీతంకంటె ఎక్కువగానే ఉంటున్నది.

"మనమింక ఈ యింట్లో ఉండద్దమ్మా!" అన్నాడు రామం ఓ రోజు.

"ఈ యింటికేమొచ్చిందిరా—" అంది తల్లి.

తలుపులకు పెచ్చులు ఊడివస్తున్నాయి. గోడలకు బెల్లులూడుతున్నాయి. దొడ్లోకి వున్న మురికి కాలువ ఎన్నిసార్లు శుభ్రం చేసినా బాగుపడడంలేదు. అందులోంచి నీరు బయటకు పోవడంలేదు. వానపడితే ఇంట్లో

వున్నట్లు కాక చెట్టుకింద వున్నట్లుంది.

"అమ్మా — ఈ యింటికే వచ్చిందా? అనడుగుతున్నావా—" అన్నాడు రామం ఆశ్చర్యంగా.

"అవున్రా — ఈ యిల్లే నిన్నింతవాణ్ని చేసింది. నెలకు యాభై రూపాయల అద్దెకు ఇంత పెద్దిల్లు మనకెలా దొరుకుతుందిరా—" అంది తల్లి.

"ఇప్పుడు మనమింకా ఎక్కువ అద్దె ఇవ్వగలం. ఇంత పెద్దిల్లూ మనకక్కర్లేదు—" అన్నాడు రామం.

సుభద్రమ్మ నులకమంచంమీద కూర్చుంది. కొడుక్కి ఆ మంచాన్ని చూపిస్తూ— "నేను అలసినప్పుడల్లా సేద తీర్చిన మంచం ఇది. ఈ రోజు నువ్వు పరుపుల మంచం ఇస్తానన్నా దీని సావాసం వదులుకోవాలనిపించదు నాకు—" అన్నది.

"బాగుందమ్మా—పరిస్థితులు బాగుపడినా మనం పేదరికాన్ని వదులుకోలేమా?" అన్నాడు రామం.

"పేదరికాన్ని వదులుకోవడంలో తప్పులేదు. కానీ అశాశ్వతమైన ఈ జీవితంలో కొన్ని బంధాలూ, అనుబంధాలూ కూడా ఏర్పరుచుకోవాలి. అప్పుడే జీవితం సక్రమ మార్గంలో నడుస్తుంది. ఇన్నాళ్ళు ఆశ్రయమిచ్చిన ఇంటిని ఈనాడు నువ్వు ఏవగించుకుంటే—ఇన్నాళ్లూ నిన్ను పెంచిన ఈ ముసలి తల్లిని కూడా ఏదో రోజున నువ్వు ఏవగించుకుంటావు—"

రామం కంగారుగా— "నేనేదో అంటే నువ్వింకేవో అర్థాలు కల్పించి మాట్లాడుతున్నావు. నాకు భయంగా వుంది—" అన్నాడు.

సుభద్రమ్మ అతడి జుత్తులోనికి వేళ్ళు పోనిచ్చి— "నీ యింటిని ఎలా వున్నా నువ్వు ప్రేమించగలిగితే—నీ

దేశాన్ని నువ్వు ప్రేమించగల్గుతావు. నీ తల్లిని ఎప్పుడూ అభిమానించగలిగితే స్త్రీ జాతిని నువ్వు గౌరవించగల్గుతావు. నీ దేశం, నీ దేశంలో స్త్రీ — ఈ రెండింటినీ ప్రత్యేకంగా అభిమానించి గౌరవించగల్గిననాడే నువ్వు ఉత్తమ పౌరుడివి కాగల్గుతావు. నువ్వొక ఆదర్శ పౌరుడిగా ఎప్పటికీ మనగలగాలన్నది నా కోరిక—" అన్నది.

రామం తడబడుతూ—"నామీద నీకేమైనా అనుమానంగా ఉన్నదా అమ్మా!" అనడిగాడు.

"నా మనసులో అనుమానం ప్రవేశించినపుడు నువ్వు నా కళ్ళలో చూసేది అభిమానం కాదు. అసహ్యం...." అంది సుభద్రమ్మ.

రాముం తల్లి కళ్ళలోకి చూడాలనుకున్నాడు. కానీ ఎందుకో భయంవేసింది. బయటకు వెడుతూ తల్లిని ఆశీర్వదించమని అడగాలనుకున్నాడు. కానీ అడగలేకపోయాడు.

'అమ్మ నన్ను ఆశీర్వదించదు—' అని అతడికి అనిపించింది.

రామం ఇంట్లోంచి బయటకు వస్తూ మరోసారి తన ఇంటిని చూశాడు—"ఈ యింటిని ఎలా ప్రేమించేది?" అనుకున్నాడు.

2

కాలింగ్ బెల్ చప్పుడు విని తలుపు తీసింది దుర్గ.

"మూర్తి ఇంట్లో లేడాండీ?" అన్నాడు వెంకట్.

"లేరు—" అంది దుర్గ.

"నేను లోపలకు రావచ్చా?" అన్నాడు వెంకట్ వినయంగా.

"అయ్యో—రండి—" అంది దుర్గ.

6

వెంకట్ లోపలకు వచ్చి కూర్చున్నాడు. ఇంటిని పరీక్షగా చూశాడు. అది డ్రాయింగ్ రూం. ఇంటివారి చక్కటి అభిరుచికి ప్రతీకగా వున్నా—అభిరుచికి తగ్గ ఐశ్వర్యంలేదనిపిస్తుంది.

వెంకట్ నిట్టూర్చి—"ఆ గోడకు అరేబియా గుఱ్ఱాల పోస్టర్ తగిలించమని మూర్తికి ఎన్నిమార్లో చెప్పాను..." అన్నాడు.

దుర్గ నవ్వి ఊరుకుంది.

"వాడు నేను చెబితే వినడు. పోనీ మీరు చెప్పొచ్చుగా—" అన్నాడు వెంకట్.

"మీ సూచన ఆయనకు బాగా నచ్చిందని నాకు తెలుసు. అందుకే నేను వేరే మళ్ళీ చెప్పడమెందుకని చెప్పలేదు—" అంది దుర్గ.

"నిజంగా నచ్చితే ఎందుకు కొనడు?" అన్నాడు వెంకట్.

"ఆ పోస్టర్ ఖరీదు మూడువేల నాలుగువందలు...."

"అయితే?"

"అంతకంటే ముఖ్యమైన అవసరాలు కొన్ని డబ్బు లేక ఆగిపోయాయి...."

"అరే—మూర్తి డబ్బు ఇబ్బందిలో ఉన్నాడా? నాకు చెప్పలేదే....!"

దుర్గ నవ్వి—"డబ్బు ఇబ్బందులేమీ లేవు. అవసరాలను తాత్కాలికంగా వాయిదా వేసుకున్నాం— అంతే! అయినా డబ్బు ఇబ్బందులు ఒకరికి చెప్పుకుంటే తీరిపోతాయా?" అంది.

"ఎందుకు తీరవు? నాకు చెప్పమనండి...." అన్నాడు వెంకట్.

"ఆయన ఇబ్బందులు తీర్చవలసిన అవసరం మీకేమిటి?"

"స్నేహితుణ్నికదా!"

"ఆయనకు చాలామంది స్నేహితులున్నారు. స్నేహం స్నేహంకోసమే కానీ డబ్బుకోసం కాదని ఆయన అభిప్రాయం. అదీకాక అప్పుచేసి అవసరాలు తీర్చుకోవడం నాకు నచ్చదు...."

"పాయింట్ కొచ్చారు. నేనిచ్చేది అప్పుగా కాదే!"

"మరి—ఊరికే యిస్తారా?"

"ఊరికే యిస్తే తీసుకుందుకు మేము బిచ్చగాళ్ళమా అని మీరు అలగవచ్చు. అందుకని నేను మూర్తికి డబ్బు ఇస్తాను. ప్రతిఫలం మీనుంచి తీసుకుంటాను—" అన్నాడు వెంకట్ నవ్వుతూ.

దుర్గకు అర్థంకాలేదు — "నానుంచి ప్రతిఫలమా? అంటే? ప్రశ్నవేశాక ఆమెకు ఏదో స్ఫురించింది. అయితే వెంకట్ ఆమెకు చాలా కాలంగా తెలుసును. అతడు మూర్తికి ప్రియతమ స్నేహితుడు. ఎంతో బుద్ధిమంతుడు.

వెంకట్ ఇంకా నవ్వుతూనే—"మూర్తి ఆఫీసు పని మీద ఊరికి వెళ్ళాడనీ — రేపు సాయంత్రం దాకా తిరిగిరాడనీ తెలిసే నేనిప్పుడిక్కడికి వచ్చాను—" అన్నాడు.

"మీరనేదేమిటి?" అంది దుర్గ కంగారుగా.

"ఇంకా మనమధ్య మన్ననలెందుకు? సూటిగా చెప్పేస్తాను. నాకు నువ్వు కావాలి. నేను నీకోసం వచ్చాను-" అన్నాడు వెంకట్.

"గెటౌట్—" అంది దుర్గ ఆవేశంగా.

"ఎందుకు?"

"గెటౌట్!" అంది దుర్గ ఇంకా ఆవేశంగా.

"ఊరికే అరవకు. నువ్విలా అరిస్తే నేను బెదిరిపోతా ననుకోకు. నువ్వేమిటో, నీ చరిత్ర ఏమిటో తెలుసుకునే ఇక్కడకు వచ్చాను...." అన్నాడు వెంకట్.

దుర్గ ఇంకా ఆవేశపడిపోయింది. ఈసారి ఆమెకు నోటమాటరాలేదు.

"నేనేమీ నిన్ను రేప్ చేయబోవడంలేదు. ముందలా తాపీగా ఎదురుగా వున్న సోఫాలో కూర్చో. నీ మొగు డెలాగూ ఊళ్ళోలేడు. రేపటిదాకా రాడు. అంచేత ఆలస్యమైపోతోందన్న బెంగా నాకు లేదు. నేను చెప్పే దంతా తాపీగా విను. అంతా విన్నాక నువ్వే వచ్చి నా పక్కన కూర్చుంటావు...." అన్నాడు వెంకట్.

"నో....నో....నీ ముఖం చూడ్డంకూడా నాకిష్టంలేదు. నువ్వేం చెప్పినా నేను వినను. తక్షణం బయటకు నడు.." అంది దుర్గ.

"నేను చెప్పేది నువ్విలాగూ వింటావని నాకు తెలుసు. అయినా ఎందుకైనా మంచిది—ముందీ ఫోటో చూడు...." అంటూ వెంకట్ ఓ ఫోటోను ఆమెకు చూపించాడు.

ఎదురుగా సోఫాలో కూర్చుని వున్న ఆమెకు ఆ ఫోటో స్పష్టంగా కనబడుతోంది. దాన్ని చూస్తూంటే ఆమె సిగ్గుతో బిక్క చచ్చిపోయింది. ఆ ఫోటో తనది! అందులో తను నగ్నంగా ఉన్నది. నగ్నంగా వున్నా ఫరవాలేకపోను .... కానీ తను ఎంత అసభ్యంగా.... ఊహకు కూడా నచ్చని విధంగా....

అప్పుడు గ్రహించింది దుర్గ. ఆ ఫోటో తనది! అది వెంకట్ చేతిలో ఉన్నది. ఆమె ఒక్క అంగలో ఆ

ఫోటో లాక్కుని ముక్కలు ముక్కలు చేసింది—"

"ఈ ఫోటో నీకు ఎక్కడిది?"

"అది నీది అని నీకు తెలుసు. ఎక్కడిదో తెలియదా?" అన్నాడు వెంకట్. వెటకారం అతడిగొంతులో ధ్వనించింది.

"గెటౌట్ .... గెటౌట్ ఫస్ట్!" అంది దుర్గ.

అనవసరంగా ఆవేశపడకు. ఫోటో చింపేశానని తృప్తి పడకు. నా దగ్గరివి ఇంకా చాలా కాపీలున్నాయి. కొన్ని ఇక్కడ.... కొన్ని ఇంటి దగ్గర...."

దుర్గ హతాశురాలై సోఫాలో కూలబడింది.

వెంకట్ చేతిలో ఇంకో ఫోటో వెలసింది. ఆ ఫోటో నతడు రెండు చేతులతోటీ దుర్గ చూడ్డానికి వీలుగా పట్టుకుని వున్నాడు. దుర్గ ఆ ఫోటోను చూస్తోంది. ఈసారి ఆవేశపడడంలేదు. దుఃఖిస్తోంది.

"నీకీ ఫోటో ఎక్కడిది?" అన్నదామె ఏడుపు కంఠంతో.

"ఎక్కడిదైతే నీకెందుకు? నిన్నిలా చూసే అవకాశం కల్పిస్తే— నేను నీకు కోరిన డబ్బు ఇస్తాను...." అన్నాడు వెంకట్.

"వెంకట్ .... నేనలాంటిదాన్ని కాదు. ఈ ఫోటో ఎలా తయారయిందో నాకు తెలియదు ..." అంది దుర్గ.

"నీచేత నేరం ఒప్పించడానికి నేను రాలేదు. నీతో కలిసి సుఖపడాలని వచ్చాను. అందుకు ప్రతిఫలంకూడా ఉంటుంది...."

"వెంకట్..నీ స్నేహితుడి భార్యను ఇలా వేధించడం నీకు తప్పుగా అనిపించడం లేదూ...." అంది దుర్గ.

"దుర్గా!" అన్నాడు వెంకట్ — "నా కోరిక

వినగానే గెటౌట్ అన్నావు నువ్వు. కానీ ఇప్పుడు ప్రతిమాలుకుంటున్నావు. నీలో ఇంత మార్పు రావడానికి కారణం ఈ ఫోటో! ఇంతకాలం స్నేహితుడి భార్యగా నీకూ నేను నా మనసులో గౌరవస్థానం ఇచ్చాను. కానీ ఇప్పుడివ్వలేను. నాలో మార్పుకి కారణం కూడా ఈ ఫోటోయే!"

దుర్గ కొన్ని క్షణాలు మాట్లాడలేదు. ఆమె ఆ ఫోటో వంకనే చూస్తోంది. ఇప్పుడామె సిగ్గుపడడంలేదు. ఆలోచిస్తోంది.

ఆ ఫోటోలో తను!

ఫోటోలో ఎంత లజ్జావిహీనంగా ప్రవర్తిస్తున్నదో ముఖంలో అంత సంతోషమూ ఉన్నది. తను....తను.... ఎన్నడూ అలా ప్రవర్తించలేదు.

ఇప్పటికీ భర్తముందు కూడా తను సిగ్గుపడుతుంది.

కానీ ఇదెలా జరిగింది?

కాసేపు ఫోటోవంకనే చూసి ఆమె కళ్ళు మూసుకుంది.

"నువ్వు మాట్లాడ్డంలేదు ..." అన్నాడు వెంకట్.

"మిస్టర్ వెంకట్! నువ్వు నీ స్నేహితుడి భార్యను గౌరవిస్తానని చెప్పావు. ఈ ఫోటోయే నీలో మార్పు తెచ్చినదని అన్నావు. ఈ ఫోటోను నావద్ద వదిలివెళ్లు. ఆ విషయమై నేను బాగా ఆలోచించవలసి వున్నది-" అంది దుర్గ.

"ఆల్ రైట్! నా దగ్గరింకా ఇలాంటి ఫోటోలు చాలా వున్నాయని గుర్తుంచుకో....నన్ను సుఖపెడితే అరేబియా ఖర్జూరాల పోస్తను.... లేదా నీ జీవితం కష్టాల పాలవుతుంది...." అన్నాడు వెంకట్.

"నేను నీకు నిర్ణయం తెలియబర్చేవరకూ నన్ను పూర్వపు దుర్గలాగనే చూడమని మనవి. దుర్గ నిప్పులాంటి మనిషని నీకు ఋజువు చేస్తాను. అలా చేయలేని నాడు నా భర్తను కూడా వదిలి వ్యభిచారిగా మారిపోతాను. అప్పుడు నా మొదటి విటుడివి నువ్వే అవుతావు—" అంది దుర్గ.

"ఈ మాటలు విని వెంకట్ తడబడ్డాడు. అతడు ఫోటోను అక్కడ టేబిల్ మీద వదిలి మారు మాట్లాడకుండా వెళ్ళిపోయాడు.

3

"నేనెక్కడున్నాను?" అన్నది సుభద్రమ్మ.

"మీకిప్పుడెలాగుంది?" అన్నదో యువతి.

సుభద్రమ్మ కళ్ళు నలుమూలని పరిసరాలను పరికించింది. ఆశ్చర్యంతో ఆమె కళ్ళు పెద్దవయ్యాయి.

తాను శయనించింది పరుపుల మంచం. గది శోభాయమానంగా అలంకరించబడి ఉన్నది. తన ఎదుట నిలబడిన యువతి అమాయకంగా అందంగా వున్నది. వయసు బహుశా ఇరవై కూడా దాటకపోవచ్చు.

"ఎవరమ్మా నువ్వు!" అంది సుభద్రమ్మ.

"నా పేరు శోభ—" అన్నదా యువతి—"నేను గుడికి వచ్చాను. ఉన్నట్లుండి మీరో కేకపెట్టి పడిపోయారు. అక్కడున్నవారంతా కంగారుపడిపోతూంటే నేను మిమ్మల్ని ఇక్కడకు తీసుకుని వచ్చాను. డాక్టరు వచ్చి మిమ్మల్ని చూసి వెళ్ళాడు. మీకేమీ భయంలేదు. మీరు పడిపోవడానికి నీరసం కారణంట—"

"అవునమ్మా—నిన్నంతా ఉపవాసం చేశాను. ఈ రోజు గుడిలో దైవ దర్శనానంతరం ఇంటికి వెళ్ళి భోం

చేద్దామనుకున్నాను. ఈలోగా ఇలా అయింది. నీ మేలు మరిచిపోలేను—....” అంది సుభద్రమ్మ.

“ఇందులో మేలేముంది? సాటిమనిషిని ఆదుకోవడం కూడా ఒక విశేషమేనా?” అన్నది శోభ.

సుభద్రమ్మ లేచి — “ఇప్పటికే నీకు చాలా శ్రమ ఇచ్చాను. ఇంక ఉంటానమ్మా! యెప్పుడైనా నీ ఋణం తీర్చుకునే అవకాశం రావాలని భగవంతుణ్ని ప్రార్థిస్తాను” అని మంచం దిగింది.

“మీరు నాకు ఋణపడి వున్నారని నేననుకోవడం లేదు. మీరలా అనుకుంటూంటే నాదో మనవి. మీకు నేను ఋణం తీర్చుకునే అవకాశమిస్తాను. ఉపయోగించుకుంటారా?” అంది శోభ.

“చెప్పమ్మా!” అంది ఆశ్చర్యంగానూ, ఆత్రుతగానూ సుభద్రమ్మ.

“రోజూ మీ ఇంటికి వచ్చి కాసేపు మీతో మాట్లాడే అవకాశం నాకివ్వాలి—” అంది శోభ.

సుభద్రమ్మ ఆశ్చర్యంగా—“ఇదా నీ కోరిక!” అంది.

“మీరిది చాలా చిన్న కోరిక అని అనుకుంటున్నారు. కానీ నేనెవరో మీకు తెలిస్తే మీరు నా కోరిక తీర్చడానికి అంగీకరించరు...”

“నువ్వు ఎవరైనా మిగతా ప్రపంచం నిన్నేవిధంగా గుర్తించినా నేను మాత్రం నిన్ను నా ప్రాణదాతగా మాత్రమే గుర్తుంచుకుంటాను—” అంది సుభద్రమ్మ.

“నేనొక వేశ్యనని తెలిసినా కూడా మీరు నన్నొక ప్రాణదాతగానే గుర్తుంచుకుంటారా?” అంది శోభ చటుక్కున.

సుభద్రమ్మ తెల్లబోయింది. ఆమె శోభవంక ఒక్క—

క్షణం రెప్పవాల్చకుండా చూసి — "ఏ పెద్దింటికో కోడలిగా వెళ్ళకలసిన చిన్నారివి. నువ్వు వేశ్యవంటే నేను నమ్మలేను—" అంది.

"మీరు నమ్మినా నమ్మకపోయినా ఇది నిజం!" అంది శోభ.

సుభద్రమ్మ చటుక్కున కూర్చుంది. అంతవరకూ ఆమెకాయింట కాస్త ఇబ్బందిగా అనిపించింది. తను కట్టిన చీర మాసిందనీ, తన చేతి కోలుగోలు గాజులు నల్లబడ్డాయనీ, తన శరీరం చెమటకంపు కొడుతున్నదనీ, తన కాళ్ళకు చెప్పులు కూడా లేవనీ—ఆమెకా గదిలో అంతసేపూ అనిపించింది. కానీ శోభ వేశ్య అని తెలియగానే సుభద్రమ్మ తానే ఉన్నత స్థానంలో ఉన్న అనుభూతి చెందింది. తానొక దేవతగానూ ఆ శోభ ఒక పసిపాపలాగానూ ఆమెకు తోచింది.

"చూడమ్మా! ఇంతవరకూ అయినదేదో అయిపోయింది. నువ్వు పాత జీవితాన్ని కొనసాగించడానికి వీల్లేదు. నీ వద్ద ఆ విధంగా మాట తీసుకుని వెడతాను...." అంది సుభద్రమ్మ.

అప్పుడు శోభ చాలా తమాషాగా నవ్వింది. ఆ నవ్వులో కనులనుంచి ప్రతిఫలించిన వెలుగులు బుగ్గలపై నీడల నేర్పరచాయి. ఆ నీడలు కథలు చెప్పడంలేదు. అవే కావ్యాల్లా వున్నాయి.

"నేను కావాలని ఇటువంటి జీవితం ఆరంభించలేదమ్మా! ఒక పాపిష్టివాడి కారణంగా నాకీ గతి పట్టింది—" అంది శోభ.

"ఎవడమ్మా వాడు!"

శోభ ఈ ప్రశ్నను పట్టించుకోలేదు — "రెండేళ్ళ

క్రితం నా వివాహమయింది. నా భర్త నన్ను అపురూపంగా చూసుకునేవాడు. ఒకరోజున ఆయనకు ఓ ఫోటో అందింది. ఆ ఫోటో ఇప్పటికీ నావద్ద ఉన్నది..." అంటూ శోభ పక్కనే ఉన్న బీరువా తలుపు తెరిచి సుభద్రమ్మకు ఓ ఫోటో తీసి అందించింది.

సుభద్రమ్మ ఆ ఫోటో చూస్తూనే అప్రయత్నంగా కళ్ళు మూసుకుని—"ఛీ!" అంది. ఇంకా ఏమో అనేదే కానీ ఆమె షాక్ తిన్నట్లుంది. ఆడవాళ్ళు అంత అసభ్యంగా ఫోటోలు తీయించుకుంటారన్న విషయం ఆమె ఊహకు కూడా అందనిది.

"నువ్వ...నువ్వ...ఈ ఫోటో తీయించుకున్నావా?" అంది సుభద్రమ్మ.

"ఏ ఆడదీ ఇలా ఫోటో తీయించుకోవాలనుకోదు" అంది శోభ — "ఈ ఫోటో నా భర్తకు అందింది. ఆయన నన్ననుమానించాడు. నే నేం చెప్పినా నమ్మలేదు. నా గురించి ఆయనకు చెడ్డగా చెబుతున్న వాడొకడున్నాడట. నా భర్త నిరాక్షిణ్యంగా నన్ను వాడికి అమ్మేశాడు. వాడు నన్నీ వృత్తిలోనికి దింపాడు. నా సంపాదనలో మూడువంతులు వాడికి. ఒక వంతు నాకు. నేను బొమ్మగా నే తప్ప సమాజంలో ఆడదానిగా గుర్తించబడను—"

"మరి—మీ వాళ్ళు కలగజేసుకోలేదా?"

"ఆయన నన్ను అమ్మేసి — లేచిపోయానని ఇంట్లో చెప్పారు. అంతా ఆయన మాటలే నమ్మారు. నా పుట్టింట్లో అంతా నన్ను అసహ్యించుకుంటున్నారు. నాకక్కడ స్థానంలేదు. విచిత్రమేమిటంటే ఆడదాని శీలానికి సమాజం ఎంతో విలువనిచ్చింది. పతితలకు అందులో

గౌరవస్థానం లేకుండా చేసింది. కానీ సమాజంలో అత్యంత గౌరవస్థానంలో ఉన్నవారందరూ పతితలను ప్రోత్సహిస్తారు—" అంది శోభ.

"నిన్ను చూస్తే నాకు జాలిగా వుంది.—" అంది సుభద్రమ్మ.

"నేను రోజూ కాసేపు మీ యింటికి వచ్చి కూర్చుని మాట్లాడి వెళ్ళడానికి అంగీకరించడానికి సరిపడ జాలి మీకు నామీద వుందా?" అంది శోభ.

"నాతో ఏం మాట్లాడతావమ్మా?" అంది సుభద్రమ్మ.

"నాకు మనుషుల మధ్య మసలాలన్నది కోరిక. నా జీవితం నాకిష్టంలేదు. ఒంటరి ఆడదానికి రక్షణలేదు కాబట్టి ఈ జీవితంనుంచి బయటపడి నేను సాధించేదేమీ లేదు. నా దగ్గరకు వచ్చే మనుషులందరూ జంతువులు. వాళ్ళు నన్నో మరబొమ్మను చేసి ఆడుకుంటారు. అందుకే రోజూ కాసేపు మీతో...."

మధ్యలో సుభద్రమ్మ అందుకుని — "నువ్వింకేమీ అడక్కు.. నువ్వు రోజూ మా యింటికి రావచ్చు. నీమీద నాకు పూర్తి సానుభూతి వుంది.." అంది.

4

"ఏమండీ—నమస్కారం..." అన్నాడతను.

ఆ యువతి అతడివంక ఆశ్చర్యంగా చూసి—"మీ రెవరో నాకు తెలియదు—" అంది.

అతడు నవ్వి — "మీరూ నాకు తెలియదు. నేను మీకు కాదు—మీ అందానికి నమస్కరించాను—" అన్నాడు.

ఆమె ఇబ్బంది పడింది. మాట్లాడకుండా ముందడుగు వేసింది.

"ఏమండీ—నన్నో పోకిరీ వెధవగా భావించకండి... నేను చాలా ఉత్తముణ్ని. మీవంటి అందం చాలా అరుదు. అందుకే నమస్కరించాను. అయితే నాకు మీతో ఇంకో చిన్న పని వుంది. ప్రముఖ నిర్మాత ప్రసాదరావు గారు మీకు తెలిసే వుంటారు. ఆయన "అందాల భామ" అనే చిత్రం తీస్తున్నారు. ఆ చిత్రంలో నేను కోడైరెక్టరుగా ఉంటున్నాను. ఇంకా హీరోయిన్ ఫిక్సవలేదు. అంతా కొత్త ముఖాలకోసం అన్వేషిస్తున్నారు. ఆ అన్వేషణలోనే మీరు నా కళ్ళబడ్డారు—" అన్నాడతను.

ఆమె ఆశ్చర్యంగా—"నాకు సినిమా అవకాశమా?" అంది.

"అవును. మేము వెతుకుతున్న కథానాయికి మీ లేనని పిస్తోంది. దయుంచి మీరు నాతో బయలేరి రండి. మనం కాలినడకనే వెడదాం. మా యూనిట్ ఉన్న యిల్లు సరిగ్గా ఇక్కడకు ఒక కిలోమీటరు దూరంలో ఉంది. మీరు ఎంతోసేపు వుండనక్కర్లేదు. స్క్రీన్ టెస్టుకు పదిహేను నిమిషాలు. జస్టు ఫిఫ్టీన్ మినిట్స్..." అన్నాడతను.

ఆ యువతికేమనాలో అర్థం కావడంలేదు. అతడు చూడ్డానికి పెద్దమనిషిలాగున్నాడు. ఆమె తటపటాయిస్తూండగా ఓ యువతి హడావుడిగా అటువచ్చి—"అరే—లీలా! మన మాలతికి యాక్సిడెంటయిందట—తెలుసా?" అంది.

లీల ఉలిక్కిపడి — "నాకు తెలియదే — ఇప్పుడది ఎక్కడుందే?" అంది.

"ప్రమాదమేమీ లేదుట. హాస్పిటల్లో ఉందిట.

నేను వెళుతున్నాను. వస్తావా?"

లీల ఆ యువతితో బయల్దేరబోతూండగా ఆ యువకుడు—"ఏమండీ—అందాల భామ ..." అని ఏదో అనబోయాడు.

"సారీ — నేనిప్పుడు రాలేను...." అన్నది లీల.

అతను చటుక్కున కాగితంమీద ఓ అడ్రసు రాసిచ్చి పోస్ట్ ఓ గంటలో ఈ అడ్రసుకు రండి. కావాలంటే మీకు కావలసిన వాళ్ళెవరినైనా కూడా తీసుకుని రావచ్చు" అని చెప్పాడు.

లీల ఆ చీటీ తీసుకుని—"అలాగే—" అని చెప్పి పరుగున ముందుకు నడుస్తున్న యువతిని అందుకుంది. ఇద్దరూ కలిసి హాస్పిటల్ చేరుకు నేందుకు ఎంతోసేపు పట్టలేదు. వాళ్ళిద్దరూ చేరుకునేసరికి గదిలో మాలతి ఒక్కతే వుంది.

"ఇప్పటికి నన్ను చూడ్డానికి పాతికమంది వచ్చి వెళ్ళారు. మీరు వస్తే మాత్రం ప్రాణం లేచివచ్చినట్లుంది" అంది మాలతి.

"ఎలా వుంది?" అంది లీల.

మాలతి యాక్సిడెంటు గురించి చెప్పింది. దురదృష్టవశాత్తూ రిక్షా బోర్లా పడింది. అదృష్టవశాత్తూ ఎముకలు విరగలేదు.

"కాని— నేనిక్కడ రేపటిదాకా ఉండాలంట. అదే బోరు—" అన్నదామె.

"మరి నేను వస్తాను—" అంది లీల.

"అదేమిటే— మొహం చూపించడానికా వచ్చింది!"

"కాదే—చిన్న పని వుంది—" అంది లీల.

"పన్నుంటే వాయిదా వెయ్యవే—" అంది మాలతి.

"నాకు మాత్రం వాయిదా వెయ్యడానికి లేదు. ఇంటి దగ్గర బావను వదిలిపెట్టి వచ్చాను. నీకు బాగానే వుందని తెలిసిందిగా—" అని జవాబుకోసం ఎదురుచూడకుండా వెళ్ళిపోయింది లీలతో వచ్చిన యువతి.

"నాకు గట్టిగా నాలుగు దెబ్బలైనా తగిలినా బాగుండును—" అంది మాలతి నిట్టూర్పుతూ.

"అదేం మాటలే—" అంది లీల మందలింపు ధోరణిలో.

"అవునే మరి! ఆత్రుతగా నన్ను చూడ్డానికి వచ్చిన వాళ్ళందరూ ఇంతేనా అని నిరుత్సాహపడి వెళ్ళిపోతున్నారు. వాళ్ళ నిరుత్సాహం చూస్తుంటే ఇక్కడున్నందుకు నాకు సిగ్గుగా కూడా వుంది. కానీ నువ్వయినా కూర్చుని కబుర్లు చెప్పవే!" అంది మాలతి.

"అందుకు నాకు అభ్యంతరమేమీ లేదు. కానీ...." అంటూ తనకు వచ్చిన సినిమా ఆఫర్ గురించి చెప్పింది లీల.

మాలతి చటుక్కున-"ఏమి అదృష్టమే నీది!" అంది.

"సినిమా ఛాన్స నిజంగానే వస్తుందంటావా?" అంది లీల.

"నీ అదృష్టం సినిమా ఛాన్సు కాదు. ఈ విషయం ముందుగా నాకు చెప్పడం—" అంది మాలతి.

"అంటే?"

"నువ్వు సినిమా ఛాన్సుకని అక్కడికి వెళ్ళావంటే కొంప మునిగిపోను—" అంది మాలతి.

"ఏమిటే—నీకేదో రహస్యం తెలిసినట్లుందే...." అంది లీల.

"అవును. రహస్యమే! అయితే అది ఒకరికి చెప్పాక నే రహస్యం కాదు. కానీ నువ్వు నా ఆత్మీయురాలివి కాబట్టి ఇది చెబుతున్నాను. ఆత్మీయురాలివైనా ఈ రహస్యం చెప్పక్కర్లేదు. కానీ రహస్యం తెలిస్తే తప్ప నిన్ను ఆపడం కష్టం—అందుకని జరిగిన విషయం నీకు చెప్పేస్తాను...." అంది మాలతి.

"అబ్బ-సస్పెన్సుతో చంపేస్తున్నావే.," అంది లీల.

"సస్పెన్సు కాదు బాబూ — జరిగింది చెప్పడానికి ఎంత సిగ్గుపడుతున్నానో—మానసికంగా నన్ను నేనెలా సిద్ధం చేసుకుంటున్నానో నీకు నేను అంతా చెప్పేదాకా అర్థంకాదు—" అంది మాలతి.

* * *

"నమస్కారం మేడమ్!"

మాలతి ఉలిక్కిపడి అటు చూసింది.

ఎదురుగా ఓ అందమైన యువకుడు రెండు చేతులూ జోడించి వున్నాడు. అప్రయత్నంగా తనూ చేతులు జోడించి—"నమస్కారం—" అంది మాలతి.

"మీ నమస్కారం నాకు గౌరవాన్నిచ్చింది—" అన్నాడతడు.

"మీరెవరో నేను తెలుసుకోవచ్చా?" అంది మాలతి.

"అందాల భామ పిక్చర్ కి కోడైరెక్టర్ని —" అన్నాడతను.

ఆమె అర్థంకానట్లు ముఖం పెట్టింది.

అతడు అందాల భామ చిత్రం గురించి వివరించి ఆమెను కథానాయికగా బుక్ చేయాలనుకుంటున్నట్లు చెప్పాడు.

"నాకు సినిమా అవకాశమా?" అంద మాలతి ఆశ్చ

ర్యాగా.

"మీరు సినిమాల్లో ప్రవేశిస్తే సినీ ఫీల్డుకే గౌరవం-" అన్నాడతడు.

"ముందు మా వాళ్ళకు చెప్పాలి—" అన్నది మాలతి.

"ఇప్పుడే రావాలి మీరు. మళ్ళీ రెండ్రోజుల దాకా అవకాశం రాదు. కావాలంటే మీకూడా తెలిసిన వారెవరినైనా తీసుకుని రావచ్చును—" అన్నాడతడు.

మాలతికి అతడిమీద నమ్మకం కుదిరింది. ఆమె ఆలోచిస్తూండగానే అలా వెడుతున్న సుధీర్ కనిపించాడు. సుధీర్ వాళ్ళ పొరుగింటి అబ్బాయి. చిన్నతనంనుంచీ మాలతికి తెలుసు.

సుధీర్ చురుకు మనిషి. ఒక్కడూ నలుగురికి సమాధానం చెప్పగల సత్తా వుంది. అతణ్ని చూడగానే ఆమెకు ధైర్యం వచ్చింది. అతణ్ణి పిలిచి విషయం చెప్పింది.

"సినిమాల్లో చేరడానికి మీ వాళ్ళొప్పుకుంటారా?" అన్నాడు సుధీర్.

"ఇది స్క్రీన్ టెస్టే కదా! సెలక్టయ్యాక మిగతా విషయాలు ఆలోచించుకోవచ్చు. జస్ట్ వెళ్ళిరావడమే గదా! ధైర్యానికి కాస్త తోడుగా వుంటావని."

ఇద్దరూ ఆ యువకుడితో బయల్దేరి ఓ యిల్లు చేరుకున్నారు. చిన్న బంగళా అది. చుట్టూ తోట వుంది. బంగళా లోపల నీటుగా వుంది.

మాలతినీ, సుధీర్‌నీ ఓ సోఫాలో కూర్చోమని చెప్పి ఆ యువకుడు లోపలకు వెళ్ళాడు.

కొద్ది నిమిషాలలో ఓ యువతి వచ్చి మాలతిని స్క్రీన్ టెస్టుకు రమ్మనమని పిలిచింది. ఇద్దరూ కలిసి ఓ చిన్న గదిలోకి వెళ్ళారు. సుధీర్ హాల్లోవుండిపోయాడు.

ఆ యువతి తలుపులు వేసింది. పక్కన ఉన్న చిన్న బీరువా వద్దకు నడిచింది. అందులోంచి అయిదు రకాల ఆధునిక దుస్తులు తీసింది.

"నిన్ను రకరకాల దుస్తుల్లో ఫోటోలు తీయాలి. త్వరగా బట్టలు మార్చుకో —" అన్నదామె.

"నువ్వు కాస్త బయటకు వెళ్ళు—" అన్నది మాలతి.

"ఆడవాళ్ళు ఆడవాళ్ళ వద్ద సిగ్గుపడకూడదు—" అన్నదామె.

మాలతి ఒప్పుకోలేదు. అప్పుడు పక్కన వున్న మరో తలుపు తెరుచుకుని వెళ్ళిపోయిందా యువతి.

మాలతి త్వరత్వరగా తన ఒంటిమీద బట్టలు తీసేసింది. అక్కడున్న అయిదు జతల్లో ఏది ముందు వేసుకోవాలా అని ఆలోచిస్తూండగా చటుక్కున పక్కనున్న తలుపు తెరుచుకుంది. అయితే వచ్చిందా యువతికాదు. తనను సినిమా పేరు చెప్పి అక్కడకు తీసుకువచ్చిన యువకుడు.

"భేష్! నువ్విలాగే బాగున్నావు. నీకిలాగే ఫోటోలు తీస్తాను...." అంటూనే చేతిలోని కెమెరాను క్లిక్‌మనిపించాడు.

మాలతి సిగ్గుతో చచ్చిపోయింది — "ఏమిటిది?" అంది గట్టిగా.

"అరవకు. ఇది సౌండ్ ప్రూఫ్ రూం—" అన్నాడతడు.

మాలతి వాడి ట్రాప్‌లో పడిపోయింది. ఆమె ఎంత గోలపెట్టినా ప్రయోజనం లేకపోయింది.

"నేను నిన్ను అనుభవానికని తీసుకునిరాలేదు. నాకు కొన్ని ఫోటోలు కావాలి. తీసుకుంటాను. నిన్ను నేను

ఏవిధంగానూ బాధించను. మర్యాదగా నా పని పూర్తి చేస్తే ఆ ఫోటోలు కూడా వెలుగులోకి రావు. లేదా....” అని బెదిరించాడతడు.

మాలతికి అంగీకరించక తప్పలేదు. తన భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తాత్కాలికంగా సిగ్గును పక్కన పెట్టింది. కనుల నీరు కారుతూండగా, మనసు తన్ను తనే అసహ్యించుకుంటూండగా అతడెలా కోరితే అలా ఫోటోలు తీసుకునే వీలు కల్పించింది.

“గుడ్! నీకింక ఏ భయమూ లేదు-” అన్నాడతడు.

మాలతి బట్టలు వేసుకుంది. అతడు పక్క గదిలోకి వెళ్ళిపోతూ—“నీ ముఖం సరిగ్గా లేదు. నీ స్నేహితుడికి అనుమానం రాకుండా నటించు. వెళ్ళు—” అన్నాడు. అతడు వెళ్ళగానే ఆ యువతి గదిలోకి వచ్చింది.

“ఇలా ఎందుకు చేశావ్?” అన్నది మాలతి హీన స్వరంతో.

“ఇది మా వ్యాపారం....” అన్నదా యువతి.

“ఇలాంటి వ్యాపారం చేయడానికి సిగ్గు వేయడం లేదూ?” అంది మాలతి.

“ఆడపిల్లలతో చేసే వ్యాపారం చేసే చాలామందికంటె మేము మెరుగు—” అందా యువతి ఏ మాత్రమూ సిగ్గు పడకుండా.

ఆ యువతి, మాలతి కలిసి బయటకు వచ్చారు.

“స్క్రీన్ టెస్టు ఎలా జరిగింది?” సుధీర్ అడిగాడు.

“మా సంస్థ మహిళకు ప్రత్యేక మర్యాదనిస్తుంది. స్క్రీన్ టెస్టుకు ఆడవాళ్ళనే నియోగించడం కేవలం మా ప్రత్యేకత—” అన్నదా యువతి.

మాలతి మాట్లాడలేదు. సుధీర్ మాత్రం ఆ సంస్థను

అదే పనిగా పొగిడాడు. ఆ పొగడ్తలు మాలతికి ముల్లుల్లా ఉన్నాయి. అయినా ఆమె భరించింది తప్పితే సుధీర్‌తో ఏమీ అనలేదు

* * *

"అమ్మ బాబోయ్—" అంది లీల. ఆమె గజగజ వణికిపోతోంది.

"నీకేమీ జరగలేదు కదే-ఎందుకలా వణికిపోతావు?" అంది మాలతి.

"గూండా అయినవాళ్ళను తీసుకువెళ్ళవమ్మా నంటే ఏమో అనుకున్నాను. నేనా సంపను పూర్తిగా నమ్మాను. కానీ నేనెలాంటి ప్రమాదంలో ఇరుక్కోబోయానో తల్చుకుంటే నా ఒళ్ళంతా జలదరిస్తోంది—" అంది లీల.

"ఆ ఫోటోలను వాళ్ళేం చేసుకుంటారో తెలియదు. అప్పట్నించీ నా మనసులో బెంగగా ఉంది—" అంది మాలతి.

"ఏం చేసుకుంటారేమిటీ—కొందరు మగ వెధవలలాంటి ఫోటోల్ని యెంత డబ్బయినా పోసి కొంటారుట—" అంది లీల.

"ఆ నా ఫోటోల్ని మగాళ్ళు చూస్తారంటే సిగ్గుతో ఒళ్ళు చచ్చిపోతోంది. ఆ ఫోటోలు చూసిన వెధవ తర్వాతెప్పుడయినా చూస్తే....?"

"మాలతీ—నీ యాక్సిడెంటు కాదుకానీ—నన్నో పెద్ద యాక్సిడెంటు నించి తప్పించింది. నీ మేలు మరవలేనే!" అంది లీల.

5

అతను లోపలకు వచ్చి తలుపు వేసి "దుర్గా!" అంటూ ఆమెను బలంగా కౌగలించుకొని గాలిలోకి ఎత్తే

కాడు.

"ఏమిటండీ యీ సినిమా ఆవేశం?" మందలించింది దుర్గ.

"ఏమిటో దుర్గా—ఒక్క రోజు నీకు దూరమయ్యానంటే ఏమిటో పిచ్చెత్తినట్లుంటుంది నాకు—" అన్నాడు మూర్తి.

"ఇప్పుడిలా అంటున్నారు. కానీ మీరు నన్ను ఒక్క-రోజు కూడా చూడకూడదనుకునే రోజు ముందున్నదని నా అనుమానం—" అంది దుర్గ.

"ఛీ—అలాంటి మాటలనొద్దు—" అన్నాడు మూర్తి.

"ఏమండీ—మీకు నా మీద పూర్తి నమ్మకమే కదూ—" అంది దుర్గ దిగులుగా.

"అదేమిటి? నీ కలాంటి అనుమాన మెందుకు వచ్చింది?" ఏదో వ్యవహార ముంటున్న విషయం బుర్రలో కెక్కడం వల్ల మూర్తికి మూడ్ మారింది.

"ముందలా దూరంగా కూర్చోండి—మీకో విచిత్రం చూపిస్తాను—" అంది దుర్గ.

మూర్తి వేరే సోఫాలో కూర్చున్నాడు.

దుర్గ ఓ ఫోటోతో అతడి ముందుకు వచ్చి—"ఇది చూడండి—" అంటూ అతిడికి అందించింది.

మూర్తి ఆ ఫోటోను అందుకొని చూసి ఆశ్చర్యపోయి "వారెవ్వా!" అని ఫోటోను ముద్దు పెట్టుకుని—హౌ డిడ్ యూ డూ దిస్—" అన్నాడు.

"యువర్ ఇంగ్లీష్ ప్లీజ్.—" అంది దుర్గ.

"నా ఇంగ్లీషును తప్పుపడితే నీ కింగ్లీషు రాదని అర్థం. కానీ నా కింత మంచి ప్రజంటేష నివ్వాలని నీ కెలా

బుద్ధి పుట్టింది?" అన్నాడు మూర్తి ఉత్సాహంగా.

దుర్గ కళ్ళలో నీళ్ళు తిరిగాయి—"మీరా ఫోటోను చూసి ఆనందిస్తున్నారు. కానీ ఆ ఫోటో ఎలా వచ్చిందీ అని ఆలోచించడం లేదు—" అంది.

మూర్తి ఉలిక్కిపడ్డాడు. క్షణంలో అతడి ముఖం గంభీరంగా అయిపోయింది—"అవును.... ఈ ఫోటో ఎలా తీయగలిగావ్!"

"నేను తీయలేదు. ఇది నాకు చేరింది...." అంది దుర్గ.

"వాట్!" అన్నాడు మూర్తి.

"ఈ ఫోటోను మీ స్నేహితుడొకడు నాకిచ్చి—ఇప్పుడు నీ చరిత్ర నాకు తెలిసిపోయింది. మర్యాదగా నాకు లొంగిపో—అన్నాడు—" అని దుర్గ ఏడ్చేసింది.

మూర్తి ఆమెను ఓదార్చలేదు. అతడికి బుర్ర పని చేస్తున్నట్లు లేదు. ఆ ఫోటో ఇతరుల ద్వారా తన భార్యకు చేరిందనగానే మొట్టమొదటగా అతడికి స్ఫురించినది—మరో మగాడు ఆ ఫోటో చూశాడని!

"అసలేం జరిగింది దుర్గా!"

"జరిగింది మీకు చెప్పానుగా!" అంది దుర్గ.

"ఎవరా స్నేహితుడు?" అన్నాడు మూర్తి.

"ఆ స్నేహితుడి పేరు తెలుసుకొని ప్రయోజనం లేదు. తప్పు అతడిది కాదు...." అంది దుర్గ.

"అది సరే—అసలిలాంటి ఫోటో తీయించుకోవాలన్న సరదా నీకెందుకు కలిగింది?" అదోలా అన్నాడు మూర్తి.

"అలాంటి సరదా నాకు కలుగుతుందన్న అనుమానం మీకుందా?" అంది దుర్గ దీనంగా.

"పోనీ— ఇలాంటి ఫోటో తీయించుకోవాల్సిన పరిస్థితులెలా వచ్చాయి?" అన్నాడు మూర్తి.

"ఆ ఫోటో— నాదే అని మీరనుకుంటున్నారా?" అంది దుర్గ.

"అంటే?"

"ఆ ఫోటో నాది కాదు—"

"దుర్గా— ఈ ఫోటో నీదయినంత మాత్రాన నిన్ను నేను వదిలిపెట్టను. కానీ నన్ను మోసం చేయాలనుకొంటే మాత్రం సహించలేను—" అన్నాడు మూర్తి చిరుకోపంతో.

"మిమ్మల్ని మోసం చేసే ఉద్దేశ్యముంటే ఈ ఫోటో మీకు చూపించేదాన్నే కాదు. మీ స్నేహితుడికి మీకు తెలియకుండా లొంగిపోయి ఉండేదాన్ని—" అంది దుర్గ.

"మరి?"

"ఇన్నాళ్ళ మీ సాహచర్యంలో మీ మీద ఏర్పడిన నమ్మకంతో నే నీ ఫోటోను మీకు చూపించాను. సావధానంగా ఆ ఫోటోను పరిశీలించండి—" అంది దుర్గ.

"నా బుర్ర పని చేయడం లేదు—" అన్నాడు మూర్తి.

"పోనీ నేనే చెబుతాను...." అంది దుర్గ.

మూర్తి నిస్సహాయంగా వెనక్కి వాలిపోయాడు.

"ఫోటోలో నా చెవులకున్న రింగులు చూశారా?" అంది దుర్గ.

మూర్తి ఫోటోను చూశాడు. ఆ రింగులు చూడగానే అతడి బుర్రలో ఏదో తళుక్కుమంది.

"ఇవి.... ఇవి.... కమల రింగులు కదూ!" అన్నాడతడు.

అతడికి ఒక్కసారి గతం గుర్తుకు వచ్చింది:

కొద్ది నెలల క్రితం మూర్తి మరదలు కమల మూర్తి ఇంటికి వచ్చింది. కమల గురించి దుర్గ మూర్తిని తరచుగా మెచ్చుకుంటూంటుంది. కమలను చూసేక దుర్గకు ఆమె పైన ప్రేమ పుట్టుకు వచ్చింది. కమల చాలా అమాయకు రాలు. మాయామర్మం తెలియని మనిషి.

కమల ఓ కొత్త డిజైన్ రింగులు పెట్టుకుంది. అలాంటివి దుర్గ ఎక్కడా చూడలేదు. "చాలా బాగు న్నాయి—" అని పదేపదే ఆమె మెచ్చుకుంటే—"పోనీ-నువ్వు తీసేసుకో—" అంది కమల.

"రింగులు బాగున్నాయి కాబట్టి బాగున్నాయన్నాను కానీ నాకవి పెట్టుకోవడం ఇష్టముండదు-..నీ ముఖానికవి ఎంతో అందాన్నిచ్చాయి—...." అంది దుర్గ.

"రింగులు నీ ముఖానికి నప్పుతాయి. నిజానికి నాకంటే నువ్వే అందమైనదానివి—" అంది కమల.

దుర్గ ఎంతవద్దన్నా ఒప్పుకోలేదు కమల. కనీసం ఒక్కపూటైనా పెట్టుకోమని బలవంతం చేయడంవల్ల దుర్గకు వాటిని ధరించక తప్పలేదు. ఆరోజంతా ముగ్గురూ కలిసి తిరిగారు. ఆ రాత్రే కమల వెళ్ళిపోయింది. వెళ్ళే టప్పుడు దుర్గ ఆమె రింగులు ఆమెకు తిరిగి ఇచ్చేసింది—

"జీవితంలో ఒకేఒక్కసారి కొద్ది గంటలసేపు ధరించానా రింగులు. ఆ కొద్ది గంటల్లోనూ కొన్ని క్షణాలు కూడా మిమ్మల్ని విడిచి వెళ్ళిన గుర్తులేదు. మనం పూర్తిగా కలిసి ఉన్నామని జ్ఞాపకం—" అంది దుర్గ.

"అవును. నాకూ అలాగే గుర్తు. కానీ...." అన్నాడు మూర్తి. అటువంటప్పుడు ఈ రింగుల్లో ఇలాంటి ఫోటో దుర్గకెలా సాధ్యపడింది?

"మీరు ఫోటోను శ్రద్ధగా గమనించండి. అది నాది కాదు—" అంది దుర్గ.

"అంటే?" అన్నాడు మూర్తి.

"మోకాలుకు కాస్త పైగా కుడికాలు మీద నాకు పొడువాటి నల్లటి మచ్చ ఉన్న విషయం మీరప్పుడే మరిచిపోయారా? ఈ ఫోటోలో అది లేదు...."

"అవును.." అన్నాడు మూర్తి. కానీ అతడికి వెంటనే ఏదో స్ఫురించింది — "మచ్చల్ని పోగొట్టడం ఫోటోగ్రఫీలో పెద్ద కష్టం కాదు...." అన్నాడు.

అంటే ఇది ఫోటోగ్రాఫిక్ ట్రిక్ అంటారా?" అంది దుర్గ.

"కావచ్చు—" అన్నాడు మూర్తి.

"అటువంటప్పుడు — ఈ ఫోటోగ్రాఫే ఓ ట్రిక్ అనుకోవచ్చుగా?"

"అంటే?"

"మీరు నన్ను నమ్ముతున్నారు కాబట్టి మరోరకంగా ఆలోచిద్దామనుకుంటున్నాను—" అంది దుర్గ.

భార్యాభర్తలిద్దరూ ఆలోచనలో పడ్డారు.

"పోనీ ఇది నీ ఫోటో కాదనుకుందాం. నీకులాంటి అమ్మాయి మరొకతె ఉండివుండాలి. నీకు కవల సోదరి ఉన్నదా?" అన్నాడు మూర్తి.

"నాకు కవల సోదరి లేదు. ఉన్నా ఇలాంటి ఫోటో తీయించుకోదు—" దృఢంగా అన్నది దుర్గ.

"మరైతే ఈ ఫోటో ఎలా తయారయిందంటావ్?"

ఒక్క క్షణం గదిలో నిశ్శబ్దం.

"ఈ ఫోటోను నాకిచ్చిన మీ స్నేహితుడి వద్దకు వెళ్ళండి. అది అతడెలా సంపాదించాడో తెలుసుకోండి"

అంది దుర్గ.

"వాడెవడో చెప్పు!" అన్నాడు మూర్తి.

6

వెంకట్ చెంప ఛెళ్ళుమంది. అతడు కోపంగా—

"వాటీజ్ దిస్ నాన్సెన్స్ మూర్తీ!" అన్నాడు.

"నీ స్నేహితుడి భార్యతో ఎలా మసలాలో తెలియ నందుకీ నాన్సెన్స్ నీకు తప్పనిసరి అయింది—" అన్నాడు మూర్తి.

"అయితే నీ భార్య నిన్ను పంపిందన్నమాట—" అన్నాడు వెంకట్.

"నా భార్య నన్ను పంపలేదు. నాకు చెప్పింది. నేను వచ్చాను—"

"ఓహ్—చెబితే వచ్చావన్నమాట—అయితే ఆమె నీకు అంతా చెప్పలేదా?"

"నా భార్యకూ నాకూ మధ్య రహస్యాలు లేవు. ఆమె నాకు అంతా చెప్పింది. అన్నీ చెప్పింది—"

"ఓహ్—అయినా ఆమె తప్పు నువ్వు తెలుసుకో లేదన్నమాట!"

మూర్తి నవ్వి — "డియర్ ఫ్రెండ్ — తప్పుచేసిన వాళ్ళకూ చెయ్యనివాళ్ళకూ ఓ తేడా వుంటుంది. ఉదా హరణకు నువ్వు తప్పు చేయలేదనుకో—నేను నిన్ను చెంప కాయ కొట్టగానే నువ్వూ నన్ను కొట్టివుండేవాడివి...." అన్నాడు.

"ఆల్ రైట్....ఇప్పుడు నీ భార్య నీనుంచి దాచిన రహస్యం నేను చూపిస్తానుండు...." అన్నాడు వెంకట్.

"నీకా శ్రమ అవసరంలేదు. నువ్వు చూపించదల్చు కున్నది ఈ ఫోటోయేననుకుంటాను-" అన్నాడు మూర్తి.

వెంకట్ తెల్లబోయి ఆ ఫోటో అందుకుని—"ఇది ఇది....ఇది నీకెలా వచ్చింది?" అన్నాడు.

మూర్తి గంభీరంగా—"నాకూ, నా భార్యకూ మధ్య రహస్యాలు లేవు—" అన్నాడు.

"ఈ ఫోటో చూసేక కూడా ఇంకా నువ్వామెను భార్య అంటున్నావా?"

"నీకు తెలియదేమో — ఈ ఫోటోలో ఆమె నాకు భార్య కాదు...."

"మరి?"

"ఆమె ఎవరో తెలుసుకోవాలంటే — ఈ ఫోటో నీకెలా వచ్చిందో నేను తెలుసుకోవాలి...."

ఉన్నట్టుండి వెంకట్ పకపకా నవ్వి—"అర్థమయింది. నన్ను మధ్య పెట్టి ఈ ఫోటో నెగెటివ్ సంపాదించాలని చూస్తున్నావన్నమాట. అలాంటి ఆలోచనలు పెట్టుకోకు. నెగెటివ్ నా దగ్గర లేదు...." అన్నాడు.

మూర్తి సీరియస్ గా మిత్రుడివంక చూసి—"నువ్వు నాకు చాలా పెద్ద ద్రోహం తలపెట్టావు. మన స్నేహాన్ని కూడా మరచి నా భార్య జోలికి రావాలనుకున్నావు. ఆమె ఎటువంటిదైనా భరించవలసినవాడిని నేను. ఈ ఫోటో నీ కళ్ళబడగానే నీవు ఆమె వద్దకు కాక నా వద్దకు రావాల్సింది—" అన్నాడు.

వెంకట్ తడబడి — "ఈ ఫోటో నీకు నీ భార్యే ఇచ్చిందా?" అన్నాడు.

"అవును...."

"ఇది నేనూహించని విషయం...." అన్నాడు వెంకట్.

"నువ్వూహించనిదింకొకటుంది. ఆ ఫోటోలో ఆమె

నా భార్య కాదు...."

"వ్వాట్!"

"చెప్పు. ఈ ఫోటో నీకెలా వచ్చిందో చెప్పు...."

వెంకట్ గుర్తుచేసుకుంటున్నాడు....

* * *

"సార్ ....ఈసారి అద్భుతమైన ఫోటో తెచ్చాను.."

"ఏదీ_" అన్నాడు వెంకట్ ఆత్రుతగా.

"డబ్బిస్తేనే చూపిస్తాను.." అన్నాడు ఆ యువకుడు.

"నే నెప్పుడైనా నిన్ను మోసం చేశానా?" అన్నాడు వెంకట్.

"మోసం గురించి కాదు సార్! ఈ ఫోటోలు చూడ్డానికే కొంత ఛార్జి వుంటుంది...." అన్నాడా యువకుడు.

వెంకట్ కీ ఆ యువకుడికీ ఇది మామూలే! అతడు అందమైన అమ్మాయిలను నగ్నంగా, అసభ్యంగా ఫోటోలు తెస్తూంటాడు. వెంకట్ కు అలాంటి ఫోటోల సేకరణ ఇష్టం!

వెంకట్ లక్షాధికారి. విలాస పురుషుడు. అతడి ఆల్బంనిండా ఎందరో నగ్న సుందరీమణులున్నారు. అతడు ఎన్నిక చేసుకుని ప్రత్యేక స్థలాలకు కాల్ గరల్స్ని పిలిపించుకుంటాడు. తన ఆల్బంను వారితో కలిసి చూడడమూ, ఆల్బంలో విధంగా తనముందు ప్రవర్తించమనడమూ అతడి హాబీ. అయితే అతను గమనించిన విచిత్ర మొకటి ఉన్నది.

కాల్ గరల్స్ బాగా చదువుకున్నవారు. సంస్కారమున్నవారు. డబ్బుకోసం ఈ వృత్తిని చేపట్టినవారు ఎక్కువ. వారిలో చాలామంది అతడి కోరికను పూర్తిగా

తిరస్కరించేవారు. కొంతమంది అంగీకరించినా-పూర్తిగా అంగీకరించినవారు బాగా తక్కువ. వాళ్ళు అనేదేమంటే "డబ్బు కోసం మరీ ఇంత నీచానికి దిగజారిపోవడం మావల్ల కాదు. శృంగారానికి కూడా సభ్యత వుంది. అసభ్య శృంగారానికి సిద్ధపడడం మావల్ల కాదు. మనం ఇద్దరు ప్రేమికుల్లా 2 గంటసేపు ఇక్కడ గడపడానికి అభ్యంతరంలేదు కానీ—ఇలా కాదు...." అని!

అతడు కోరినవిధంగా ఫోటోలు తీయించుకోడానికి ఒక్కరంటే ఒక్కరు కూడా అంగీకరించలేదు. వెంకట్ మనసులో అదో కోరికగా మిగిలిపోయింది. ఆ ఫోటోల్లోని యువతులు మరీ దిగజారినవారని అతడికి నమ్మకం ఏర్పడింది. అందుకే వారిని వెతుక్కుని పిలిపించుకోవాలన్నా అతడికి భయంగా ఉండేది.

ఆ యువకుడి చేతిలో రెండువందలు పెట్టి ఫోటోను చూపమన్నాడు వెంకట్. ఫోటోను చూడగానే అతడి శరీరం జలదరించింది.

ఫోటోలో యువతి ఎంత అసభ్యంగా ఉన్నదో—ఆమె అంగసౌష్టవం అంత ఆకర్షణీయంగా ఉన్నది. అయితే ఆమె ముఖం స్థానంలో నల్లగా ఉన్నది. ఇది అతడికి కొత్త కాదు.

"ముఖం లేదేం?" అన్నాడు వెంకట్.

"ఈమె చాలా మర్యాదయిన కుటుంబం మనిషి. మా వ్యాపారం దృష్ట్యా ఆమెకు మాట ఇచ్చాను. ఫోటోలో ముఖం బయటపడనీయమని ...."

ఇదో పెద్ద వ్యాపార రహస్యమని వెంకట్‌కు తెలుసు. నలుపు చేస్తారు. చాలామందికి ముఖంతో పని వుండదు. కేవలం శరీర ప్రదర్శనకు సంబంధించిన

ఫోటోలు కొంటారు. అయితే వెంకట్ కు అలా నచ్చదు. ముఖం కనబడాలి. ముఖం కనబడకపోయాక ఆ శరీరానికి అర్థమేమున్నదని అతడి భావన....

"నాకా ఫోటో కావాలి... ముఖంతో సహా ..."

"సారీ సార్.... సాధ్యపడదు...."

"వెయ్యి రూపాయలిస్తాను...."

వెంకట్ అనుమానమేమిటంటే ఆ యువతి కురూపి అయ్యుండాలని. ఆమె అందంగా కనుక ఉండి ఉంటే ఎలాగైనా ఆమె వివరాలు సంపాదించి తన వద్దకు రప్పించుకోవాలి. ఆమె మర్యాదయిన కుటుంబానికి చెందినదని ఆ యువకుడంటున్నాడు. అదే నిజమైతే తన కోరిక తీరినట్లే కదా!

"వెయ్యి రూపాయలంటున్నారు కాబట్టి ప్రయత్నిస్తాను...." అన్నాడా యువకుడు. సాధారణంగా ఫోటోకు మూడు నాలుగువందలకు మించి ఎవ్వరూ ఇవ్వరతడికి.

* * *

"అప్పుడీ ఫోటో తెచ్చాడు. చూసి ఆశ్చర్యపోయాను. కాల్ గరల్స్ కూడా అంగీకరించని ఈ ఫోజు చూసేక నా మనసెలా పనిచేస్తుందో నువ్వూహించలేవా?" అన్నాడు వెంకట్.

"జరిగిందానికి నిన్ను నేను తప్పుపట్టను. కానీ ఇప్పుడు నాకు నువ్వు సాయం చేస్తావా—ఆ వెధవను చూపించి!"

ఏమనుకున్నాడో వెంకట్ అంగీకరించాడు.

7

"ఏమిటి సార్! కొత్త ఫోటోలేమైనా కావాలా?" అంటూ ఆ యువకుడు అక్కడకు వచ్చాడు.

మూర్తి ఆ యువకుణ్ని చూశాడు. చూడగానే అతడి బుర్రలో తళుక్కున మెరిసింది.

ఆ యువకుడతడికి బాగా గుర్తున్నాడు.

ఆ రోజు తను... తన మరదలు ... భార్య.... ముగ్గురూ సినిమాహాలు ముందున్న లాన్‌లో తిరుగుతూండగా....

“సార్ .... మీరిద్దరూ మేడ్ ఫర్ ఈచదర్‌లా వున్నారు. నన్నొక్క ఫోటో తీయనివ్వండి సార్ ....” అన్నాడా యువకుడు.

“మేమిలా ఉంటే నీకెందుకు?” అన్నాడు మూర్తి.

“ఫోటోగ్రఫీ నా హాబీ సార్! అదే నా వృత్తి కూడా! మంచి ఫోటోలకోసం రోడ్లమ్మట తిరుగుతూంటాను. మీ ఫోటోలు నాకెంతగానో ఉపయోగపడతాయి ఆర్థికంగా! ప్రతిఫలంగా మీకో రెండు కాపీలు ఇచ్చుకోగలను——” అని కాళ్ళా వేళ్ళాపడ్డాడు.

ఆ యువకుడు వారి అందాన్ని, జంటనూ విపరీతంగా పొగిడాడు. ఆ జంటతో కలిసి మరదలు కూడా ఫోటో తీయించుకోవాలని సరదాపడింది. ఉత్తినే ఫోటో వస్తూన్నదని అంతా కక్కుర్తిపడ్డారు.

ఆ తర్వాత ఎడ్రసుకు వచ్చి ఫోటో కాపీలిచ్చి మరీ వెళ్ళాడా యువకుడు.

ఒక్కసారి అంతా గుర్తుకురాగా మూర్తికి ఆవేశం వచ్చింది. చటుక్కున యువకుడి ముందుకు వచ్చి—

“ఏయ్—నేను గుర్తున్నానా?” అనడిగాడు.

వాడిలా ఎంతమందిని చూశాడో గానీ మూర్తి వాడికి గుర్తులేదు—“మీరెవరు సార్!” అన్నాడు.

“ఒకసారి మేడ్ ఫర్ ఈచదర్ అని చెప్పి పొగిడి మా ఫోటో తీశావు. ఇప్పుడు నా భార్య తలకాయ నీ

ఫోటోలో ఎవరికో అతికించావు..."

"ఏమిటి సార్ మీర నేదికి"

"చెబుతాన్రా ..." అంటూ మూర్తి ఆవేశంగా డొక్కలో తన్నాడు.

"మూర్తి! తప్పు నీలో ఉంచుకుని వాడి మీదెందుకూ విరుచుకు పడతావ్!" అన్నాడు వెంకట్.

"తప్పు నాలో లేదు. వీడిలోనూ—వీడిలాంటి వాళ్ళను ప్రోత్సహించే నీలోనూ ఉంది. మీ యిద్దరి కారణంగా ఓ అమాయకురాలి జీవితం సర్వనాశనమై పోయేది. ఇలా ఇప్పటికి ఎంతమంది అమాయకురాండ్ర జీవితాలు నాశనమైపోయాయో...." అన్నాడు మూర్తి.

"ఏమిటి నువ్వనేది?"

"ఆ ఫోటోలో నా భార్య ధరించిన రింగులు ఆమె జీవితంలో ఒకేఒక్కసారి కొద్ది గంటలసేపు ధరించింది. అంతసేపూ నాతోనే వున్నదామె. ఆ సమయంలోనే వీడు మా జంటకు ఫోటో తీశాడు. ఆ ఫోటోను మరో కందుకు ఉపయోగించుకుంటాడని నాకు తెలియదు. ఇందులో తలను తీసుకువెళ్ళి మరో ఆడదాని శరీరానికి అతికించాడు...." అన్నాడు మూర్తి.

వెంకట్ ముఖం గంభీరంగా అయిపోయింది— "నిజమా?"అన్నాడతడా యువకుడిని తీవ్రంగా చూస్తూ.

యువకుడు వెంటనే ఒప్పుకోలేదు.

"మర్యాదగా నువ్వు నిజం ఒప్పుకోకపోతే—నిన్ను పోలీసులకు అప్పగించేస్తాను. ఆ తర్వాత వాళ్ళు రంగం లోకి దిగి — వాళ్ళ పద్ధతు లుపయోగించి నీ వ్యవహారం మొత్తం బయటపెడతారు...." అన్నాడు వెంకట్.

"పోలీసుల్ని రంగంలోకి దించవద్దు సార్. నిజం

చెబుతాను....” అన్నాడా యువకుడు.

అమాయకులైన ఆడవాళ్ళను మాయమాటలతో మభ్య పెట్టి ఏకాంతానికి తీసుకుని వెళ్ళి అప్పుడు వాళ్ళను బెదిరించి అసభ్యకరంగా ఫోటోలు తీసి—విలాసపురుషులకు అమ్మడం అతని వ్యాపారం. ఆడపిల్లలను ఆకర్షించడానికీ, ఫోటోలు తీయడానికీ ఆ యువకుడి అందం ఉపయోగపడుతున్నది.

వెంకట్ వాడిని ఆ చెంపా ఈ చెంపా వాయించి- “దుర్మార్గుడా — ఇంతకాలం నువ్వు నీచప్రవృత్తిగల ఆడవాళ్ళగురించి ఈ ఫోటోలు తీసుకుంటున్నావను కున్నాను. కానీ వారిని వేధించి, క్రూరంగా బాధపెట్టి ఈ పని చేస్తున్నావని నేననుకోలేదు—” అన్నాడు.

“ఏ ఆడదీ-తనకుతానై ఇలాంటి పనులకు ఒప్పుకోదని నీకు తెలియకపోవడం విచారించవలసిన విషయం వెంకట్!” అన్నాడు మూర్తి. తర్వాత అతడా యువకుడివంక తిరిగి—“ఫోటోలు తీశావు. సరే— ఆ తర్వాత తలలు మార్చడమెందుకు? అదే వ్యవహారాన్నింతవరకూ తెచ్చింది....” అన్నాడు.

యువకుడు మౌనంగా తల వంచుకున్నాడు.

“అడిగిందానికి బదులు చెప్పు!” అన్నాడు వెంకట్.

“చెబితే మీ ఆవేశం పెరిగిపోతుంది—” అన్నాడా యువకుడు.

అతడు రామం.

చెప్పకపోతే ఆవేశం ఇంకా పెరిగిపోతుంది—” అన్నాడు మూర్తి.

“ఆ ఫోటోలు — అప్పుడే యవ్వనప్రాంగణంలో అడుగుపెట్టిన మొగ్గలాంటి యువతులవి. ఆ ముగ్ధ పరి

స్థితికి తట్టుకోలేరు. ప్రపంచంలోని విషాదమంతా గూడు కట్టుకుని ఉన్న ఆ ముఖాలు యెటువంటివారికైనా హృదయవిదారకంగా వుంటాయి. అందుకే నవ్వుతూ కలకలలాడుతూ వున్న ముఖాన్ని ఆ శరీరానికి అతికించడం జరుగుతున్నది...."

రామం ఇంకా తన మాటలు పూర్తిచేయకుండానే "మూర్తీ! ముందు పవిత్ర మూర్తి అయిన నీ భార్య పాదాలమీదపడి క్షమార్పణ అడిగే వరకూ నాకు మనశ్శాంతి వుండదు. పద....ప్లీజ్!" అన్నాడు.

"నా భార్య సచ్ఛీలతపైన నాకు నమ్మకమున్నది. అయితే ఈ ఫోటోలవల్ల ఇంకా ఎంతమంది ఆడవాళ్ళు నష్టపోతున్నారో .... ముందు వీడిసంగతి పట్టేదాకా నాకు నిమ్మితముండదు...." అన్నాడు మూర్తి.

8

"ఎవరండీ మీరు?" అన్నది సుభద్రమ్మ.

"అమ్మా—రామం మీ అబ్బాయే కదూ!" అన్నాడు మూర్తి లోపలకు అడుగు పెడుతూ.

"అవును—ఏం—వాడికేమయింది?" అంది సుభద్రమ్మ కంగారుగా.

"ఏమీ కాలేదు. మీవాడు మంచి ఫోటోగ్రాఫరు. మిమ్మల్నభినందించిపోదామని వచ్చాను...." అన్నాడు మూర్తి.

సుభద్రమ్మ కళ్ళు మెరిశాయి—"వాడికి చదువుకునే రోజుల్లోకూడా ఫోటోగ్రఫీలో ప్రైజులొచ్చేవి బాబూ! ఎటొచ్చీ వాడికి స్వంత కెమేరా లేదు. వాళ్ళనీ వీళ్ళనీ అడిగి తెచ్చుకునేవాడు. అంతా అనేవారు — స్వంత కెమేరాయే వుంటే వీడింకా గొప్పవాడైపోతాడని...."

"ఆ గొప్పతనం మీకు కళ్ళారా చూపిద్దామనే వచ్చాను...." అంటూ మూర్తి ఆమెకో కవరు అందించాడు. సుభద్రమ్మ ఆత్రుతగా కవరందుకుని అందులోని ఫోటోలు తీసి చూసి — ఏదో ఉపద్రవం వచ్చినట్లు కెవ్వుమని అరిచింది. వెంటనే ఆమె చేతినుంచి ఆ ఫోటోలు జారిపోయి ఇల్లంతా పడ్డాయి.

"ఇదీ మీ కొడుకు ప్రతాపం...." అన్నాడు మూర్తి, జరిగిన కథంతా చెప్పి.

"ఏడీ వాడు!" అంది సుభద్రమ్మ ఆవేశంగా.

సరిగ్గా అప్పుడే వెంకట్, రామం—గదిలో అడుగు పెట్టారు.

వెంటనే సుభద్రమ్మ లేడిమీదకు దూకిన సింహంలా కొడుకుమీద పడింది. ఇష్టంవచ్చినట్లు అతగాణ్ని కొట్టి చేతుల్లో శక్తి అయిపోగా నీరసంగా కూలబడి—"నిన్ను చావగొట్టడానికి భగవంతుడు నాకు మరింత శక్తినిచ్చివుంటే ఎంత బాగుండేది!" అంది.

రామం మౌనంగా అన్నీ భరించాడు.

"ఎందుకు చేశావురా ఈ పని!" అంది సుభద్రమ్మ.

రామం మాట్లాడలేదు.

"చెప్పరా?" ఆమె అరిచింది.

"నీకోసం ..." అన్నాడు రామం.

తల్లి అతణ్ని అష్టకష్టాలూపడి పెంచింది. ఆమెను అష్టయిశ్వర్యాల్లో ముంచెత్తాలని అతడు అడ్డదారులు తొక్కాడు.

"ఓరి దౌర్భాగ్యుడా! నేను నిన్ను పెంచి పెద్దచేయడానికి అష్టకష్టాలూ పడకుండా అడ్డదార్లు తొక్కివుంటే ఈరోజు నువ్విలా నలుగుర్లో తలెత్తుకుని తిరిగివుండే

వాడివా? పరాయి ఆడదాన్ని గౌరవిస్తే నే తల్లిని గౌర వించినట్లు. ఆడదాన్ని నీచంగా చూస్తే నువ్వు నీ కన్న తల్లి నే నీచంగా చూసినట్లు. ఆడదాన్ని గౌరవించని కుటుంబం నాశనమైపోతుంది. ఆడదాన్ని అవమానించా లనుకునే సమాజం సర్వనాశనమైపోతుంది. ఒక ఆడది ఎంతలా గౌరవించబడుతున్నదీ అన్నదాన్ని బట్టేరా— ఒక సమాజపు విలువ అంచనా వేయబడేది...." అంది సుభద్రమ్మ.

"నన్ను క్షమించమ్మా!" అన్నాడు రామం.

"క్షమించు అని ఒక ముక్క అంటే నువ్వు చేసిన తప్పులు సరిదిద్దబడతాయా?" అంది సుభద్రమ్మ.

"మరి నేనిప్పుడేం చేయనమ్మా!" అన్నాడు రామం దిగులుగా.

అప్పుడు సుభద్రమ్మకు శోభ గుర్తుకు వచ్చింది. ఆమె మూర్తివంక అభినందన పూర్వకంగా చూసి—"బాబూ- నీది చాలా గొప్ప మనసు. అందువల్లనే మావాడివంటి చీడపురుగులున్నా—నువ్వు నీ భార్యను అనుమానించ లేదు. కానీ అంతా నీకులా ఉండరు. ఓ అమ్మాయి బ్రతుకిలాగే అన్యాయమైపోయింది. ఆమె ఇప్పుడు వేశ్యావృత్తిని చేపట్టింది. అందుకు కారణం మావాడేనని నాకిప్పుడర్థ మవుతున్నది. ఆ పిల్లను నా యింటి కోడలుగా ఆహ్వా నిస్తాను...." అంది.

రామం మాట్లాడలేదు.

వెంకట్, మూర్తి ఇంట్లోంచి బైటపడుతూ— "ఆ తల్లి బహుదొడ్డది. ఇలాంటి ఇంట్లో ఉండతగ్గది కాదు" అనుకున్నారు.

—:అయిపోయింది:—